డివిజన్‌లో దశలవారీగా అభివృద్ధి పనులు



సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సంగీత

అత్తాపూర్: డివిజన్‌లో దశలవారీగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని అత్తాపూర్ డివిజన్ కార్పొరేటర్ మొంద్ర సంగీత పేర్కొన్నారు. హైదర్‌గూడ సిరిమల్లెనగర్ కాలనీ ఫేస్–2లో రూ. 23.10 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రోడ్డు పనులు పూర్తయిన వెంటనే స్తంభాలకు వీధి లైట్లు కూడా ఏర్పాటు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఏఈ రాజేశ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, రాజు, కాలనీవాసులు పాల్గొన్నారు.

హెల్ప్ ఆన్ విల్స్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదానం

రాజేంద్రనగర్: హెల్ప్ ఆన్ విల్స్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతినెల నిర్వహించే అన్నదానంలో భాగంగా జీహెచ్ఎంసీ కార్యాలయం సమీపంలోని క్రీస్తు గుట్ట వద్ద శనివారం అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో హెల్ప్ ఆన్ విల్స్ ట్రస్ట్ ఫౌండర్ అండ్ అధ్యక్షులు బండ్లగూడెం ప్రసాద్, బండ్లగూడెం కవిత, అప్పారెడ్డిగూడెం మహేందర్, కోరని జాన్ రవి, గుంటి ప్రశాంత్, బండ్ల నరేందర్, గుంటి రవి, కోరని కుమార్, గుంటి సురేశ్ మాదిగ, బెంజమన్, బండ్ల కెవిన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికతోనే లక్ష్య సాధన



శంషాబాద్: ప్రణాళికతో ముందుకు వెళ్తేనే లక్ష్యాన్ని సాధించవచ్చని శంషాబాద్ ప్రభుత్వోన్నత బాలుర పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కృష్ణారెడ్డి పేర్కొన్నారు. పదో తరగతి విద్యార్థుల ఫేర్‌వెల్ పార్టీని పాఠశాలలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని మంచిగా చదువుకోవాలని సూచించారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ రేఖాగుప్తా, కాంగ్రెస్ నాయకుడు అక్రమ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

తల్లీకుమార్తె అదృశ్యం



అఖిల

శంషాబాద్ రూరల్: తల్లీ కుమార్తె అదృశ్యమైన ఘటన శంషాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ కె.నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం .. పెద్దషాపూర్‌కు చెందిన బొల్లారి రాజేశ్ భార్య అఖిల (24) రోజూ ఆలస్యంగా నిద్రలేవడంతో పాటు వంట చేసేది కాదు. దీంతో రాజేశ్ తల్లి రాధిక వంట చేస్తుండేది. ఫిబ్రవరి 27న ఉదయం ఈ విషయమై ఇంట్లో గొడవ జరిగింది. అదే సమయంలో అఖిల తన కూతురు తేజస్వినిని కొడుతుంటే రాజేశ్ అడ్డుకున్నాడు. అనంతరం రాజేశ్ మధ్యాహ్నం శంషాబాద్‌కు, కాసేపటికే రాధిక పింఛన్ డబ్బుల కోసం శంషాబాద్‌కు వెళ్లింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో అఖిల కూతురు తేజస్వినిని తీసుకుని బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. దీంతో పలుచోట్ల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో రాజేశ్ శనివారం శంషాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాల్మాకులలో వృద్ధుడు..



భిక్షపతి

శంషాబాద్ రూరల్: వృద్ధుడు అదృశ్యమైన ఘటన మండలంలోని పాల్మాకులలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ కె.నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కట్కూరి భిక్షపతి (74) కుటుంబ విషయంలో కోడలితో గొడవపడ్డాడు. ఈ క్రమంలో ఫిబ్రవరి 28న ఉదయం ఎవరికీ చెప్పకుండా ఇంట్లోనే ఫోన్ పెట్టి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు పలు చోట్ల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో కుటుంబ సభ్యులు శనివారం శంషాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తి అరెస్ట్

రాజేంద్రనగర్: గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తిని ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేసి శంషాబాద్ ఎక్సైజ్ పోలీసులకు అప్పగించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జల్‌పల్లి చెందిన నవీన్ 2 కిలోల గంజాయితో లక్ష్మీగూడ నుంచి జల్‌పల్లికి వెళ్తున్నాడు. సమాచారం అందుకున్న రాష్ట్ర ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు లక్ష్మీగూడ వద్ద నవీన్‌ను అదుపులోకి తీసుకుని సోదా చేయగా 2 కిలోల గంజాయి లభించింది. దీంతో నిందితుడిని అరెస్ట్ చేసి శంషాబాద్ పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పార్కు స్థలాల రక్షణకు చర్యలు

రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్



ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌కు వినతిపత్రం అందజేస్తున్న భవానీకాలనీ సభ్యులు

బండ్లగూడ: పార్కు స్థలాలు కబ్జాకు గురికాకుండా చర్యలు తీసుకుంటానని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ అన్నారు. పార్కు ఖాళీ స్థలాలను ఆక్రమించేందుకు కొందరు యత్నిస్తున్నారని అడ్డుకోవాలని కోరుతూ కార్పొరేషన్ పరిధిలోని భవానీకాలనీ రెసిడెన్సి వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు శనివారం ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాలనీలోని పార్కు ఖాళీ స్థలాలను కొందరు తమ పేర్లపై నమోదు చేసుకుంటున్నారన్నారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో, హైడ్రా అధికారులకు ఫిర్యాదు చేశామని పేర్కొన్నారు. పార్కు స్థలాల చుట్టూ ప్రహరీ నిర్మించాలని, మొక్కలు నాటాలని, పిచ్చి మొక్కలు తొలగించాలన్నారు. పార్కును అభివృద్ధి చేసి బెంచీలు, వాకింగ్ ట్రాక్, జాగింగ్ చేసేందువు వీలుగా, చిన్న పిల్లలు ఆడుకునేందుకు క్రీడా సామగ్రి ఏర్పాటు చేయాలన్నారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారని వెంటనే కార్పొరేషన్ కమిషనర్‌తో ఫోన్లో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారని వారు తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో అధ్యక్షుడు అశోక్‌కుమార్, ప్రధాన కార్యదర్శి జీవన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు శైలజ, సంయుక్త కార్యదర్శి వెంకటేశ్, కోశాధికారి నాగేశ్వర్‌రెడ్డి, సభ్యులు కిరణ్, తిరుపతి, ప్రేమ్, రాజ్‌కుమార్, చక్రధర్ తదితరులు ఉన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు ఎమ్మెల్యే పరామర్శ

మణికొండ: అగ్ని ప్రమాదంలో ముగ్గురు మృతి చెందగా, బాధిత కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే టి. ప్రకాశ్‌గౌడ్ శనివారం పరామర్శించారు. కిరాణషాపులోని ఫ్రిడ్జ్‌కు హైఓల్టేజీ విద్యుత్ సరఫరా కావడంతో మంటలు చెలరేగి ప్రమాదం జరిగిందని ఇంటి యజమాని ఉస్మాన్‌ఖాన్ ఎమ్మెల్యేకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్పందిస్తూ విద్యుత్, రెవెన్యూ శాఖల పరంగా కూడా ఆదుకునే అవకాశాన్ని పరిశీలిస్తామన్నారు. అనంతరం ఎమ్మెల్యే, మణికొండ మున్సిపల్ మాజీ చైర్మన్ కె. నరేందర్‌ముదిరాజ్ రూ. 1 లక్ష చొప్పున రూ. 2 లక్షల ఆర్థిక సాయాన్ని వారికి అందించారు. గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ టి. మల్లేశ్‌ముదిరాజ్, నార్సింగి మార్కెట్ కమిటీ చైర్మన్ కె. వేణుగౌడ్, నార్సింగి మున్సిపాలిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు కె. అశోక్‌యాదవ్, నాయకులు జి.వెంకటేశ్‌యాదవ్, బి.శ్రీరాములు, యాలాల నరేశ్, తాజుద్దీన్, లక్ష్మీశ్రీ, వసంతరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ



కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు

మైలార్‌దేవ్‌పల్లి: బుద్వేల్ నేతాజీనగర్ మండల ప్రాథమిక పాఠశాలలో శనివారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి తోటి స్టూడెంట్లకు పాఠ్యాంశాలు బోధించారు. అనంతరం రాజేంద్రనగర్ ఎంఈఓ శంకర్‌రాథోడ్, ప్రధానోపాధ్యాయుడు ఎస్.బాలకృష్ణ మాట్లాడుతూ..ఈ తరహా కార్యక్రమాలతో విద్యార్థుల్లో నాయకత్వం, ఆత్మవిశ్వాసం పెంపొందుతుందన్నారు. కార్యక్రమంలో నవయువ యూత్ క్లబ్ అధ్యక్షుడు ఏర్వ కుమారస్వామి, ఉపాధ్యక్షులు రమేశ్‌రెడ్డి, కొంపల్లి జగదీశ్, ఉపాధ్యాయులు మమత, మహేశ్వర్, లక్ష్మి, యాదమ్మ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సాంకేతికతలో ఏఐ పాత్ర కీలకం



సర్టిఫికెట్లు అందుకున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థినులు

శంషాబాద్: మారుతున్న సాంకేతిక వినియోగంలో ఏఐ (కృత్రిమ మేథో) పాత్ర ఎంతో కీలకమైందని శంషాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హిమబిందు పేర్కొన్నారు. లెర్నింగ్ లింక్స్ ఫౌండేషన్ సహకారంతో డిగ్రీ కళాశాలలో 15 రోజులుగా ఏఐలో విద్యార్థులకు ఇచ్చిన శిక్షణ తరగతులు శనివారం ముగిశాయి. ఈ సందర్భంగా విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. సాంకేతిక పరిజ్ఞానంలో విస్తృతమైన ప్రావీణ్యం పొందేందుకు ఈ కోర్సు ఎంతగానో ఉపయోగపడుతుందని మహిళా సాధికార సెల్ కో–ఆర్డినేటర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎస్. భవానీ తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

బమ్రుక్ దౌలా చెరువును పరిరక్షించాలి



కబ్జాకు గురైన చెరువును పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

రాజేంద్రనగర్: బమ్రుక్ దౌలా చెరువును పరిరక్షించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు రాజేంద్రనగర్ మండలం సీపీఎం సీనియర్ నాయకుడు జీఎం కురుమయ్య అధ్యక్షతన నాయకులు శనివారం చెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా రాజేంద్రనగర్ మండల కార్యదర్శి జాజాల రుద్రకుమార్ మాట్లాడుతూ.. కొంతమంది కబ్జాదారులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు, బూర్జువా పార్టీ నాయకులు అధికారులతో కుమ్మక్కై చెరువుకు సంబంధించిన సుమారు 108 ఎకరాలు భూమిని కబ్జా చేశారన్నారు. ఈ మధ్యనే హైడ్రా చెరువుకు అనుకొని ఉన్న కొన్ని ఇండ్లను కూల్చివేసిందని అయితే మళ్లీ అదే ప్రాంతంలో అక్రమంగా షెడ్లు, ఇళ్లను నిర్మించేందుకు కబ్జాదారులు ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. ప్రస్తుతం ఉన్న చెరువును పూర్తిగా ఫినిషింగ్ చేయించి ప్రహరీ నిర్మించి అదనంగా కబ్జాకు పాల్పడినవారిపై హైడ్రా, జీహెచ్ఎంసీ, రెవెన్యూ అధికారులు, కలెక్టర్ వెంటనే క్షేత్రస్థాయి పర్యటన చేసి వారికి నోటీసులు జారీ చేసి చెరువు స్థలంలోని అక్రమ కట్టడాలు, ఇండ్లను డిస్మెంటల్ చేయించి ప్రభుత్వ భూమిని కాపాడాలన్నారు. కార్యక్రమంలో రాజేంద్రనగర్ మండల సీపీఎం నాయకులు ఎస్.మోహన్, ఎం.శ్రీకాంత్, కాలే రాజు, రియాజ్, శివ, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

మణికొండలో ఎగ్జిబిషన్‌కు విశేష ఆదరణ



కొండపల్లి బొమ్మలను కొనుగోలు చేస్తున్న ప్రజలు



అలంకరణ వస్తువులు కొనుగోలు చేస్తున్న యువతులు

మణికొండ: మణికొండ పైప్‌లైన్ రోడ్డులోని సుందర్ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో కొనసాగుతున్న ఆల్ ఇండియా హ్యాండ్లూమ్స్, హ్యాండీక్రాఫ్ట్ ఎగ్జిబిషన్‌కు విశేష ఆదరణ వస్తోంది. శనివారం పెద్ద సంఖ్యలో కొనుగోలుదారులు తరలివచ్చారు. ఇందులో మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరి, భాగల్‌పూర్, డిజైనర్, కాంతా వర్క్, హ్యాండ్‌బ్లాక్ ప్రింటెడ్ లెనిన్, కలంకారి, బెంగాల్ కాటన్ చీరలతో పాటు డ్రస్ మెటీరియల్, డిజైనర్ బ్లౌస్‌లు, ఖాదీ మెటీరియల్, వన్ గ్రాం గోల్డ్ జ్యువల్లరీ, జైపూర్ బెడ్‌షీట్, కొండపల్లి బొమ్మలు, పర్సులు, గృహోపకరణ వస్తువులు, వన్‌గ్రామ్ గోల్డ్ జ్యువల్లరీని విక్రయిస్తున్నారు. అనేక రాష్ట్రాల్లో చేతి వృత్తి కళాకారులు తయారు చేసిన వస్తువులన్నీ ఒకే చోట మంచి నాణ్యతతో లభిస్తుండడంతో ప్రజలు కొనుగోళ్లు చేసేందుకు ఆసక్తి చూపిస్తున్నారని నిర్వాహకులు తెలిపారు. కొన్ని రోజులు మాత్రమే ఎగ్జిబిషన్ ఉంటుందని మణికొండ మున్సిపాలిటీ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకుడు అక్బర్ సూచించారు.

మంచిరేవులలో ముగిసిన బ్రహ్మోత్సవాలు



రథోత్సవంలో మంచిరేవుల వాసులు

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని మంచిరేవుల మచిలేశ్వరస్వామి, వీరభద్రస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు శనివారం ముగిశాయి. మహాశివరాత్రిని పురస్కరించుకుని గత నెల 26న బ్రహ్మోత్సవాలు ప్రారంభం కాగా చివరి రోజు శనివారం ఉదయం 4 గంటలకు నందీశ్వర సేవ, అనంతరం రథోత్సవాన్ని నిర్వహించారు. అలాగే రథంపై స్వామివార్లను ఊరేగించారు. గ్రామస్తులు రథాన్ని లాగి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ ఆవరణలో అన్న ప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమంలో గ్రామస్తులతో పాటు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా కార్తీక్ రెడ్డి జన్మదిన వేడుకలు



కార్తీక్ రెడ్డికి బొకే అందజేసి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు



కార్తీక్ రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలుపుతున్న కార్పొరేటర్ అర్చనాజయప్రకాశ్

రాజేంద్రనగర్: బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, రాజేంద్రనగర్ నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి పట్లోళ్ల కార్తీక్ రెడ్డి జన్మదిన వేడుకలను రాజేంద్రనగర్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రాజేంద్రనగర్, బుద్వేల్, శివరాంపల్లి, ఉప్పర్‌పల్లి ప్రాంతాల్లో కేక్ కట్ చేసి పిల్లలకు పంపిణీ చేశారు. అలాగూ ఆయా ప్రాంతాల్లోని వృద్ధులు, అనాథలకు భోజనాన్ని అందజేశారు. ఉదయం కార్తీక్ రెడ్డిని ఆయన నివాసంలో పార్టీ సీనియర్ నాయకులు కొలను సుభాష్ రెడ్డి, జాలిగం చిత్తారి, రమేశ్ ముదిరాజ్, జంగయ్య, పచ్చ శీను తదితరులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. శంషాబాద్‌లోని పార్టీ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో రాజేంద్రనగర్ డివిజన్ కార్పొరేటర్ అర్చనా జయప్రకాశ్ కార్తీక్ రెడ్డిని కలిసి బొకే అందజేసి ఘనంగా సన్మానించారు.

రేపు జాతీయ మిల్లెట్స్ కిసాన్ మేళా

ఏజీవర్సిటీ: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్స్ (ఐసీఏఆర్) ఆధ్వర్యంలో ఈనెల 3న జాతీయ మిల్లెట్స్ కిసాన్ మేళా నిర్వహించనున్నట్లు ఐఐఎంఆర్ ప్రతినిధి సుబ్బారాయుడు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పిలుపు మేరకు విక్షిత్ భారత్ కోసం నిర్వహిస్తున్న ఈ మేళాలో 2 వేల మంది రైతులు వ్యవసాయ మహిళలు, సాంకేతిక నిపుణులు, పరిశోధనా సంస్థలు, విధాన నిర్ణేతలు పాల్గొనున్నట్లు పేర్కొన్నారు. రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో నిర్వహించే మేళాకు భారత ప్రభుత్వ వ్యవసాయం, రైతు సంక్షేమ శాఖ మంత్రి భగీరథ్ చౌదరి ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు తెలిపారు. వీరితో పాటు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, ఎన్ఐఆర్‌డీపీఆర్, ఎన్ఐపీహెచ్ఎం, ఐసీఏఆర్ డైరెక్టర్లు, డిప్యూటీ డైరెక్టర్లు, ఇతర ముఖ్య అధికారులు పాల్గొననున్నట్లు పేర్కొన్నారు.

ఎల్ఆర్ఎస్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

మణికొండ: అనుమతుల్లేని లేఅవుట్లలో గతంలో ప్లాట్లు కొనుగోలు చేసిన వారు ఎల్ఆర్ఎస్ పథకంలో వాటిని రెగ్యులరైజ్ చేసుకోవాలని నార్సింగి, మణికొండ మున్సిపల్ కమిషనర్లు టి. కృష్ణమోహన్‌రెడ్డి, డి. ప్రదీప్‌కుమార్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. మున్సిపాలిటీ కార్యాలయాల్లో ఇందుకోసం ప్రత్యేక హెల్ప్‌డెస్కులు ఏర్పాటు చేశామని రెగ్యులరైజేషన్‌కు చెల్లించే ఫీజులోనూ 25 శాతం రాయితీ ఇస్తున్నామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు.

బైక్ ఢీకొని యువకుడికి గాయాలు

శంషాబాద్ రూరల్: బైక్ ఢీకొని యువకుడు గాయపడిన ఘటన శంషాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ కె.నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. రాజేంద్రనగర్‌లోని ప్రేమావతిపేట్‌కు చెందిన ప్రహ్లాద్ (24), గగన్‌పహాడ్ వాసి మొహ్మద్ అలీబాబా గండిగూడ వద్దనున్న గ్యాస్ గోదాంలో పని చేస్తున్నారు. ఫిబ్రవరి 26న మహాశివరాత్రి ఉపవాస దీక్ష విరమించేందుకు ప్రహ్లాద్ అలీబాబా బైక్ తీసుకుని శంషాబాద్ వెళ్తున్నాడు. బెంగళూరు జాతీయ రహదారిపై ఆటోనగర్ సమీపంలోకి రాగానే ఎదురుగా రాంగ్‌రూట్లో వచ్చిన మరో ద్విచక్ర వాహనదారుడు ప్రహ్లాద్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ప్రహ్లాద్ గాయపడగా శంషాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం నిమ్స్‌కు తీసుకెళ్లారు. శనివారం అందిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

‘కిషన్‌రెడ్డిపై సీఎం వ్యాఖ్యలు సరైనవి కావు’

చార్మినార్: రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఎన్నో రకాలుగా కృషి చేస్తున్నప్పటికీ..సీఎం రేవంత్‌రెడ్డి ఆయనపై ఆరోపణలు చేయడం సరైనది కాదని బీజేపీ గోల్కొండ జిల్లా అధ్యక్షుడు టి.ఉమామహేంద్ర అన్నారు. హైదరాబాద్ నగరంలో మెట్రో రైలు ప్రాజెక్టు కోసం కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి ఎప్పటికప్పుడు ప్రయత్నిస్తున్న కిషన్ రెడ్డి కృషిని సీఎం రేవంత్ రెడ్డి తప్పుగా ప్రచారం చేయడం దురదృష్టకరమన్నారు. అంతేగాకుండా మూసీ సుందరీకరణ ప్రాజెక్టు కోసం కూడా ఆయన పాత్ర ఎంతో ఉందన్నారు. ఇక బీసీల సంక్షేమం కోసం ముందు నుంచి పనిచేస్తోంది కిషన్ రెడ్డి మాత్రమేనన్నారు. ఇలా రాష్ట్ర అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్న కేంద్రమంత్రి కిషన్ రెడ్డిని తప్పుపట్టడం సీఎం రేవంత్ రెడ్డికి తగదన్నారు. ఇప్పటికైనా ఆయన కిషన్ రెడ్డిపై చేసిన ఆరోపణలను ఉప సంహరించుకోవాలని ఉమామహేంద్ర డిమాండ్ చేశారు.

అమరవీరులకు ఘన నివాళి



నార్సింగిలో నివాళులర్పించిన నాయకులు



మణికొండలో ..

మణికొండ: మాదిగ రిజర్వేషన్ పోరాటంలో అమరులైన వారికి శనివారం ఘనంగా నివాళులర్పించారు. నార్సింగి మున్సిపల్ కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మండల ఎమ్మార్పీఎస్ ఇన్‌చార్జి గణేశ్‌మాదిగ మాట్లాడుతూ.. 30 ఏళ్ల సుదీర్ఘ పోరాటంలో ఎందరో తమ ప్రాణాలు కోల్పోయారన్నారు. మాదిగ జాతి ఉపకులాలు వారి పోరాటాన్ని గుర్తుంచుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు నరేందర్ మాదిగ, దేవాదాస్ మాదిగ, రవికుమార్ మాదిగ, దాసు మాదిగ, రవికుమార్ మాదిగ, విజయ్ మాదిగ పాల్గొన్నారు. మణికొండ మున్సిపల్ గ్రామ కమిటీ అధ్యక్షుడు డి. కల్యాణ్‌మాదిగ ఆధ్వర్యంలోనూ శివాజీనగర్‌లో అమరవీరుల చిత్రపటాల వద్ద నివాళులర్పించారు.

ఆకట్టుకున్న అకడమిక్ ఫేర్



గౌతమ్ మోడల్ స్కూల్ వేడుకల్లో విద్యార్థులు, సిబ్బంది

బండ్లగూడ: సన్‌సిటీ హైదర్షాకోట్ గౌతమ్ మోడల్ స్కూల్లో శనివారం నిర్వహించిన అకడమిక్ ఫేర్ అలరించింది. భూమిపై చీకటి వెలుగుల నుంచి చంద్రయాన్ రోవర్ దాకా..అయోధ్య రామ మందిరం నుంచి కుంభమేళా దాకా.. విద్యార్థులు ప్రదర్శించిన విభిన్నమైన కార్యక్రమాలతో జరిగిన ఫేర్ ఆకట్టుకున్నది. ప్రిన్సిపాల్ సునీత, కార్యనిర్వాహకులు విశ్వనాథ్ గజ్రే, అశోక్ గజ్రే, రామ్‌సింగ్, వినోద్ చాగ్లే తదితరులు విద్యార్థులను అభినందించారు.

ఆకట్టుకున్న జాతీయ సైన్స్ డే ..

మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి శ్రీ చైతన్య పాఠశాలలో శనివారం జాతీయ సైన్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా డాక్టర్ సయ్యద్ జహీర్ బాషా, ప్రిన్సిపాల్ సుజాత సెబాస్టియన్ పాల్గొని విద్యార్థుల ప్రదర్శనలను తిలకించి అభినందించారు. విద్యార్థులు తమలోని నైపుణ్యాలను ప్రాజెక్టుల రూపంలో ప్రదర్శించారు. అనంతరం వారికి సర్టిఫికెట్స్, మెడల్స్, మెమోంటోలు అందజేశారు. కార్యక్రమంలో డీన్ శ్రీనివాస్, ప్రైమరీ ఇన్‌చార్జి శ్రావణి, కాజల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సోలీటైర్ గ్లోబల్ స్కూల్‌లో..

మైలార్‌దేవ్‌పల్లి: కాటేదాన్ సోలీటైర్ గ్లోబల్ స్కూల్‌లో శనివారం నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా విద్యార్థులు రూపొందించిన పలు ఆవిష్కరణలు ఆలోచనలు రేకెత్తించేలా ఉన్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అనిల్ వసంత్, వైస్ ప్రిన్సిపాల్ అముక్తరెడ్డి, ఉపాధ్యాయులు అనిత, సరితతివారి, నస్రీన్, సునీత, అర్జున్, లక్ష్మి, రామకృష్ణ, మల్లేశ్, విశాల్, నాజ్, రిజ్వి, స్వప్న, అంకిత, మాధవి తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ ఈవెంట్స్‌లో సత్తాచాటిన పల్లవి స్కూల్ విద్యార్థులు

అత్తాపూర్: అత్తాపూర్‌లోని పల్లవి ఇంటర్నేషనల్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు అకడమిక్ ఎక్సలెన్స్, సృజనాత్మక నైపుణ్యాలను ప్రదర్శించే 2 ప్రముఖ సైన్స్ ఈవెంట్లలో వినూత్న ప్రాజెక్టులను ప్రదర్శించారు. డీఆర్‌డీవో, ఏఈఎస్ఐ, కేబివై ఆధ్వర్యంలో నిర్వహించిన రోబోటిక్ ఆర్మ్ అనే కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, సీఎం రేవంత్‌రెడ్డి ప్రశంసాలు పొందారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ అన్నపూర్ణ, ఉపాధ్యాయులు అర్చన, విద్యార్థులు మణిసుదీప్, సాయి, సహస్ర, కృష్ణ, అక్షిత్ తదితరులను వారు అభినందించారు. అలాగే రాజేంద్రనగర్‌లోని ఐఐఆర్ఆర్‌లో నిర్వహించిన పోస్టర్ మేకింగ్, క్విజ్ పోటీల్లోనూ విద్యార్థులు తృతీయ బహుమతులు సాధించినట్లు ప్రధానోపాధ్యాయురాలు షాలీ ఉమ్మన్ తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రదర్శనలు తిలకిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు



ప్రదర్శనలు తిలకిస్తున్న డాక్టర్ సయ్యద్ జహీర్ బాషా తదితరులు



సైన్స్ ప్రదర్శనలో పల్లవి స్కూల్ విద్యార్థులు